క్లుప్తంగా

సీజనల్ వ్యాధులపై అవగాహన



సీజనల్ జ్వరాలు, సికిల్ సెల్ ఎనీమియాపై అవగాహన కల్పిస్తున్న వైద్యులు, సిబ్బంది

పాలకొండ రూరల్: ప్రస్తుత సీజన్‌లో అడపాదడపా కురుస్తున్న వర్షాలకు నీరు నిల్వ ఉండి దోమలు వృద్ధి చెందుతాయని, ఈ నేపథ్యంలో ప్రబలే సీజనల్ వ్యాధులపై అవగాహన కలిగి ఉండాలని ఎం.సింగుపురం పీహెచ్‌సీ వైద్యాధికారి ఎస్.రవికుమార్ అన్నారు. దోమల వల్ల డెంగీ, మలేరియా, టైఫాయిడ్, బోధకాలు వంటి వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని తెలిపారు. పీహెచ్‌సీ పరిధిలోని పలు గ్రామాల్లో సీజనల్ వ్యాధులపై గురువారం అవగాహన కల్పించారు.

ఒడిశాకు పైనాపిల్ ఎగుమతి



వ్యాన్‌లోకి పైనాపిల్ ఎక్కిస్తున్న దృశ్యం

సీతంపేట: జై ఆదివాసీ ఉద్యాన, వ్యవసాయ అను బంధ ఉత్పత్తిదారుల పరస్పర సహాయ, సహకార సంఘం ఆధ్వర్యంలో సీతంపేట ఏజెన్సీలో పండించిన పైనాపిల్ పండ్లను ఒడిశాకు గురువారం ఎగుమతి చేశారు. కడగండి, రోలుగుడ్డి, కుమ్మరిగండి పంచాయతీల పరిధిలో సుమారు 215 మంది రైతుల వద్ద నుంచి 32 వేల పైనాపిల్ కాయలను ఒక్కొక్కటి రూ.15 లెక్కన కొనుగోలు చేశారు. ఈ నెలాఖరు వరకు ఒడిశాలో పండగలు ఉండడంతో అక్కడ అమ్మకాలు చేయనున్నట్టు ఎఫ్‌పీఓ చైర్మన్ కె.గణపతిరావు తెలిపారు. కార్యక్రమంలో బీఓడీ సవర సూర్య, సీఈఓ గణేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులు నిర్భయంగా ఉండాలి



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

భామిని: గర్భిణులు భయం వీడి నిర్భయంగా ఉండాలని బత్తిలి పీహెచ్‌సీ వైద్యాధికారి కొండపల్లి రవీంద్ర అన్నారు. పీహెచ్‌సీ పరిధిలోని పలు గ్రామల్లో గురువారం అవగాహన ర్యాలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... లేనిపోని భయాలతో బీపీ పెంచుకోవద్దని సూచించారు. ప్రభుత్వాస్పత్రుల్లో మెరుగైన సేవలు అందిస్తున్నామని, గర్భిణులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎంఎల్‌హెచ్‌ఓ శ్రావణి, నూతన్ నాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

లక్ష్యాలను అధిగమించాలి

గరుగుబిల్లి: మహిళా సంఘాల సభ్యులు ఆర్థికంగా మరింత అభివృద్ధి చెందాలనే ఉద్దేశంతో స్త్రీనిధి ద్వారా మంజూరు చేస్తున్న రుణాల లక్ష్యాలను సిబ్బంది అధిగమించాలని పార్వతీపురం మన్యం జిల్లా స్త్రీ నిధి అసిస్టెంట్ జనరల్ మేనేజర్ (ఏజీఎం)పి.కామరాజు వెలుగు సిబ్బందికి దిశా నిర్దేశం చేశారు. స్థానిక వెలుగు కార్యాలయంలో వెలుగు సిబ్బందితో స్త్రీ నిధి రుణాలు పంపిణీపై గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబంధించి స్త్రీనిధి రుణాల మంజూరులో మండల వెలుగు ఏపీఎం పెదరెడ్ల అప్పలనాయుడు ఆధ్వర్యంలో క్లస్టర్ కో-ఆర్డినేటర్లు ప్రత్యేక శ్రద్ధ కనబరచడంపై ఏజీఎం సంతృప్తి వ్యక్తం చేశారు. మహిళా సంఘాల సభ్యులు తీసుకున్న రుణాలను ఆర్థికాభివృద్ధికి వినియోగించుకుని తిరిగి సకాలంలో చెల్లించాలని కోరారు. వెలుగు ఏపీఎం అప్పలనాయుడు, క్లస్టర్ కో-ఆర్డినేటర్లు చందాన తిరుపతిరావు, బొంగు రామినాయుడు, వి.లక్ష్మణరావు, టి. చంద్రమోహన్, కార్యాలయ సిబ్బంది కొప్పర రమేష్, ఉడమల శాంతికుమారి పాల్గొన్నారు.

ఎస్‌డబ్ల్యూపీసీ సందర్శన

కొమరాడ: మండల కేంద్రంలోని ఎస్‌డబ్ల్యూపీసీని (చెత్తనుంచి సంపద తయారీ కేంద్రం) జిల్లా పంచాయతీ అధికారి కె. కొండలరావు గురువారం సందర్శించారు. పారిశుద్ధ్య కార్మికులు, అధికారులకు ఆయన పలు సూచనలు చేశారు. ప్రతీ ఇంటి నుంచి చెత్తను సేకరించి ఎస్‌డబ్ల్యూపీసీకి తరలించాలని, తడి, పొడి చెత్తను వేరు చేసి తడి చెత్తలో సేంద్రియ ఎరువు తయారు చేయాలని చెప్పారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. వివిధ సర్వేలు, స్వర్ణ పంచాయతీ లాగిన్‌లో అప్‌డేట్‌చేసిన డేటాపై ఆరాతీశారు. గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఎంపీడీఓ మల్లి కార్జునరావు,డిప్యూటీ ఎంపీడీఓ రాధాకృష్ణ, రిసోర్స్‌పర్సన్ భీమయ్య, ఎమ్మార్సీ క్రాంతి, తదితరులు పాల్గొన్నారు.

భారీ వర్షం

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని పలు గ్రామాల్లో గురువారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. సుమారు ఒంటిగంటకు ప్రారంభమైన వర్షం దఫదఫాలుగా సాయంత్రం వరకు కొనసాగింది. రహదారులన్నీ జలమయమయ్యాయి.

సచివాలయ వ్యవస్థపై ..
కూటమి ప్రభుత్వం కుట్ర

- రెండు సచివాలయాలను ఒక క్లస్టర్‌గా మార్చేందుకు కసరత్తు చేస్తున్న ప్రభుత్వం
- రేషనలైజేషన్ పేరుతో సచివాలయాల కుదింపు
- ఈ నేపథ్యంలో తీసుకువచ్చిన జీఓ 4పై విమర్శలు



గ్రామ సచివాలయం

వీరఘట్టం:

ప్రజలకు ప్రభుత్వ సేవలన్నీ ఒకే చోట అందించేందుకు గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సచివాలయ వ్యవస్థకు శ్రీకారం చుట్టారు. ప్రతి రెండు వేల మంది జనాభాకు ఒక సచివాలయం ఏర్పాటు చేసి, దేశ చరిత్రలో సచివాలయ వ్యవస్థను నూతన అధ్యాయంగా రూపొందించారు. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 4 లక్షల మంది యువతీ, యువకులకు సచివాలయాల్లో ఉద్యోగాలు కల్పించి.. ప్రతి ఇంటికీ ప్రభుత్వ పథకాలు అందించారు. అటువంటి గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థను కూల్చేందుకు కూటమి ప్రభుత్వం కుట్ర చేస్తోంది. రేషనలైజేషన్ పేరుతో సచివాలయాలను కుదించేందుకు రంగం సిద్ధం చేసింది. ప్రతి రెండు సచివాలయాలను కలిపి క్లస్టర్‌గా ఏర్పాటు చేసేందుకు సన్నాహక చర్యలు ప్రారంభించింది. అయితే ఈ క్లస్టర్ విధానం గ్రామ, వార్డు సచివాలయాల్లో పనిచేస్తున్న వీఆర్‌ఓలకు తలనొప్పిగా మారనుంది. దీంతో సచివాలయాలను హేతుబద్ధీకరణ చేసేందుకు కూటమి ప్రభుత్వం తీసుకువచ్చిన జీఓ 4ను వీఆర్‌ఓలు వ్యతిరేకిస్తున్నారు.

ఏం జరుగుతోంది..

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రెండు లేదా మూడు రెవెన్యూ గ్రామాలను ఒక సచివాలయంగా మార్చి ప్రభుత్వ సేవలన్నీ ప్రజలకు ఒకేచోట అందించి ప్రజల మన్ననలు పొందింది. అయితే సచివాలయాల్లో పనిచేస్తున్న వారిలో చాలా మందికి ఖాళీగా ఉన్నారని కూటమి ప్రభుత్వం భావిస్తోంది. ప్రజలకు సేవాలు బాగానే అందుతున్నప్పటికీ కుట్రపూరితంగానే సచివాలయాలను కుదించేందుకు ప్రయత్నిస్తోందని పలువురు ఆరోపిస్తున్నారున. ప్రతి సచివాలయంలో పనిచేస్తున్న వీఆర్‌ఓలు మాత్రం నిరంతరం ప్రజలతో మమేకమవుతూ ప్రజలకు సేవలందించడంలో కీలకంగా వ్యవహరిస్తున్నారు. భూసర్వే, అడంగల్ మంజూరు, మ్యుటేషన్లు, పొజిషన్ సర్టిఫికెట్లు, కులం, ఆదాయం, ఇలా రెవెన్యూ వ్యవస్థలో ఉన్న 90 రకాల సేవలను ప్రజలకు వీఆర్‌ఓలు అందిస్తున్నారు. అయితే కూటమి ప్రభుత్వం తీసుకురానున్న క్లస్టర్ విధానంతో రెండు సచివాలయాల పరిధిలో ఉండే సుమారు 5 వేల మంది ప్రజలకు ఒక వీఆర్‌ఓ రెవెన్యూ సేవలు అందించాల్సి ఉంటుంది. దీంతో తమపై పనిభారం పెరగనుందని వీఆర్‌ఓలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఇదీ పరిస్థితి..

పార్వతీపురం మన్యం జిల్లాలోని 15 మండలాల్లో 312 సచివాలయాలున్నాయి. రేషనలైజేషన్ పేరుతో కూటమి ప్రభుత్వం వీటిని 166కు కుదించేందుకు రంగం సిద్ధం చేస్తోంది. 312 సచివాలయాల్లో పనిచేస్తున్న వారిలో సీనియార్టీ ప్రకారం ఉద్యోగులను 166 క్లస్టర్లలో నియమిస్తారు. మిగిలిన 156 మంది పరిస్థితి అగమ్యగోచరంగా మారనుంది. కూటమి ప్రభుత్వ నిర్ణయంతో భవిష్యత్‌లో ఇబ్బందులేర్పడతాయని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

రేషనలైజేషన్‌తో పని ఒత్తిడి..



గ్రామ, వార్డు సచివాలయాలను రేషనలైజేషన్ పేరుతో కుదించి కొత్తగా తీసుకురానున్న క్లస్టర్ విధానం అమలైతే వీఆర్‌ఓలపై పని భారం పడుతుంది. అసంబద్ధంగా ఉన్న ఈ క్లస్టర్ విధానంతో భూసమస్యలు పెరుగుతాయి. రైతులు, ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. క్లస్టర్ విధానంపై ప్రభుత్వం పునరాలోచన చేసి జీఓ 4ను రద్దు చేయాలి.

– ఎం.సింహాచలం, వీఆర్‌ఓల సంఘ జిల్లా అధ్యక్షుడు, పార్వతీపురం మన్యం

సచివాలయానికో వీఆర్‌ఓ..



ప్రతి సచివాలయానికి ఒక వీఆర్‌ఓ ఉండేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలి. క్లస్టర్ విధానంతో రెవెన్యూ వ్యవస్థ చిన్నాభిన్నంగా మారనుంది. వీఆర్‌ఓల సంఘ నాయకుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకుండా ప్రభుత్వం జీఓ 4 విడుదల చేయడం సరైన నిర్ణయం కాదు.

– పి.రఘునాయుడు, వీఆర్‌ఓల సంఘ డివిజనల్ అధ్యక్షుడు, వీరఘట్టం

ఎండీయూ వాహనాలు కొనసాగించాలి



తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న ఎండీయూ ఆపరేటర్లు

పాలకొండ: రేషన్ అందించే వాహనాలను కూటమి ప్రభుత్వం రద్దు చేయడం అమానుషమని ఎండీయూ నిర్వాహకుల యూనియన్ నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు గురువారం స్థానిక రెవెన్యూ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎండీయూ నిర్వాహకుల యూనియన్ జిల్లా అధ్యక్షుడు పి.మన్మధరావు మాట్లాడుతూ.. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంతో 18500 కుటుంబాలు రోడ్డున పడతాయని ఆవేదన వ్యక్తం చేశారు. కష్టం కాలంలో కూడా లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి రేషన్ సరుకులు పంపిణీ చేశామని, అటువంటి తమపై ఇంత కక్ష తగదన్నారు. ప్రభుత్వం వాహనాల రద్దు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని కోరారు. గత నెల ఇన్సూరెన్స్ డబ్బులు తమ వ్యక్తిగత ఖాతా నుంచి కట్ చేశారని.. వెంటనే ఆ మొత్తం తిరిగి తమకు జమచేయాలని కోరారు. 2027 వరకు తమ వాహనాలకు అగ్రిమెంట్ ఉందని బ్యాంకు లావాదేవీలకు ప్రభుత్వం బాధ్యత వహించాలని కోరారు. కార్యక్రమంలో రమణ, ప్రశాంత్, శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

ఎత్తివేయడం తగదు..?

సీతంపేట: ఇంటింటికీ రేషన్ సరుకులు పంపిణీ చేసే ఎండీయూ వాహనాలు ఎత్తివేయడం తగదని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఎం.తిరుపతి రావు ఒక ప్రకటనలో తెలిపారు. ఎండీయూ వ్యవస్థను మరింత పటిష్టం చేసి బియ్యం, పంచదార, నూనె, పప్పులు, చింతపండు వంటివి పంపిణీ చేయాలని కోరారు.

పాఠశాల స్థాయి తగ్గించే ఆలోచన మానుకోవాలి

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని కేదారిపురం గ్రామ ప్రాథమికోన్నత పాఠశాల స్థాయిని ప్రాథమిక పాఠశాలకు తగ్గించే ఆలోచనను అధికారులు మానుకోవాలని మాజీ ఎంపీటీసీ నిమ్మక కృష్ణ, ఆ గ్రామస్తులు కోరుతున్నారు. గురువారం వారు విలేకరులతో మాట్లాడుతూ గ్రామానికి గిరిజన మోడల్ స్కూల్ మంజూరు చేస్తూ 7వ తరగతి వరకు ఉన్న పాఠశాలను 5వ తరగతికి కుదిస్తుండడం సరికాద ని, ఈ విధానంతో విద్యార్థులకు ఉన్నత విద్య దూరమవుతుందన్నారు. అధికారులు స్పందించి ప్రాథమికోన్నత పాఠశాలను ఉన్నత పాఠశాలగా స్థాయి పెంచాలని కోరారు. పాఠశాల స్థాయిని తగ్గించే ఆలోచనను విరమించుకోవాలని లేకుంటే ఎంఈఓ కార్యాలయం ముందు ధర్నాకు దిగుతామ ని హెచ్చరించారు.

పిల్లల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

పాలకొండ రూరల్: అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారుల ఆరోగ్య భద్రత, రక్షణ పట్ల సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఐసీడీఎస్ పాలకొండ సెక్టార్ సూపర్‌వైజర్ దశారత్నం అన్నారు. పట్టణ పరిధిలోని పలు అంగన్‌వాడీ కేంద్రాలను గురువారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా రికార్డుల నిర్వహణ, పిల్లలకు అందిస్తున్న పౌష్టికాహారం, తదితర అంశాలపై ఆరా తీశారు. ప్రస్తుత వేసవిలో అనుసరించాల్సిన విధివిధానాలపై సిబ్బందికి పలు సూచనలు చేశారు.

చిత్రలేఖనంపై అవగాహన

పాలకొండ రూరల్: చిత్రకారులు గ్రాఫ్ పద్ధతిని అనుసరించడం ద్వారా చిత్రలేఖనంలో క్రమబద్ధత ఉంటుందని తంపటాపల్లి ప్రభుత్వ పాఠశాల డ్రాయింగ్ ఉపాధ్యాయుడు జి.మురళి అన్నారు. గురువారం స్థానిక శాఖా గ్రంథాలయంలో గ్రాఫ్ పెయింటింగ్‌పై విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. సరళమైన పద్ధతిని వినియోగించి సమాజహితం కోరే చిత్రాలనే గీయడం ద్వారా గుర్తింపు పొందవచ్చన్నారు. వేల మాటల్లో చెప్పలేని భావం ఒక్క చిత్రంతో చెప్పవచ్చని చెప్పారు. కార్యక్రమంలో గ్రంథపాలకుడు బి.గణేష్‌బాబు ఆంగ్ల భాషపై పట్టు సాధించే పదాలపై అవగాహన కల్పించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కొమరాడ: మండల కేంద్రంతో పాటు గుమడ గ్రామానికి శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగనుందని విద్యుత్‌శాఖ ఏఈ జి. వెంకటరమణ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. విద్యుత్ లైన్లకు ఆనుకుని ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు పనులతో పాటు మరమ్మతులు చేపట్టను న్నందున విద్యుత్‌సరఫరాను నిలిపివేయనున్నామని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

వైభవంగా హనుమజ్జయంతి..

కోరిన వారికి కోరిన రూపంలో దర్శనమిస్తాడు.. ఆర్తిగా పిలిచేవారికి ఆపన్నహస్తం అందిస్తాడు.. భగవంతుడు, భక్తుడు ఒక్కటయ్యే మార్గానికి వారధి మన హనుమ. రాముడెంత ఘనుడో.. రామభక్తుడైన హనుమ కూడా అంతే ఘనుడని భక్తుల నమ్మకం. అటువంటి హనుమ జయంతిని గురువారం వాడవాడలా వైభవంగా నిర్వహించారు. వేకువజాము నుంచే ఆంజనేయస్వామి ఆలయాల్లో పూజలు చేపట్టారు. సిందూరం, తమలపాకులతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానాలు చేపట్టారు. అలాగే పలుచోట్ల ఆంజేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలతో పాటు శోభాయాత్రలు నిర్వహించారు.

– సాక్షి నెట్‌వర్క్



సీతంపేట: కాశీవిశ్వేశ్వర ఆలయం ప్రాంగణంలో హనుమంతుడిని దర్శించుకుంటున్న భక్తులు



వీరఘట్టం: హనుమాన్ శోభాయాత్రలో జై హనుమాన్ అంటూ నినదిస్తున్న భక్తులు



గరుగుబిల్లి: పెద్దూరులో పూజలు చేస్తున్న భక్తులు



పాలకొండ రూరల్: ఎం.సింగుపురంలో అన్నదానం



పాలకొండ: వడమ గ్రామంలో ఆంజనేయ విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొన్న తూములు కళావతి, లక్ష్మణరావు దంపతులు



జియ్యమ్మవలస: వెంకటరాజపురంలో పూజలు చేస్తున్న మహిళలు

రగ్గుల వితరణ



సీతంపేట మండలం పొంద్రకు చెందిన వనమూలికా వైద్యుడు ఎం.ఫల్గుణరావు పేద గిరిజనులకు గురువారం రగ్గులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఏటా సేవా కార్యక్రమాలు చేపడుతుంటానని చెప్పారు. – సీతంపేట

సీతంపేటలో తిరంగా ర్యాలీ



పహల్గామ్ దాడికి దీటుగా పాకిస్తాన్‌పై చేపట్టిన ఆపరేషన్ సిందూర్ విజయవంతం కావడంతో సైనికులకు మద్దతుగా సీతంపేటలో గురువారం తిరంగా ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా భారత్‌మాతాకీ జై అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు ఎం.విశ్వనాథం, గార రవణమ్మ, గేదెల చిరంజీవులు, తదితరులు పాల్గొన్నారు. – సీతంపేట

అవగాహనతోనే ప్రీ- ఎక్లాంప్సియా నివారణ



గరుగుబిల్లి: ర్యాలీ చేస్తున్న గరుగుబిల్లి పీహెచ్‌సీ సిబ్బంది



జియ్యమ్మవలసరూరల్: అవగాహన కల్పిస్తున్న జియ్యమ్మవలస పీహెచ్‌సీ వైద్యాధికారి జగదీష్

గరుగుబిల్లి: గర్భధారణ సమయంలో వచ్చే ప్రీ-ఎక్లాంప్సియా వ్యాధిని అవగాహనతోనే నివారించవచ్చని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి సంతోష్‌కుమార్ తెలిపారు. ప్రపంచ ప్రీ-ఎక్లాంప్సి యాడే సందర్భంగా మండల కేంద్రంలో గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ ప్రీ- ఎక్లాంప్సియా అనేది గర్భధారణ సమయంలో వచ్చే ఒక ప్రమాదకరమైన పరిస్థితి అని చెప్పారు. ఈ వ్యాధి లక్షణాలను సకాలంలో గుర్తించగలిగితే చికిత్స ద్వారా ప్రమాదాన్ని తగ్గించవచ్చని చెప్పారు. హెల్త్ సూపర్‌వైజర్ చిన్నమ్మి, వైద్య సిబ్బంది రమణమ్మ, ఉదయ్‌కుమారి, దుర్గాప్రసాద్, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

జియ్యమ్మవలసలో...

జియ్యమ్మవలస రూరల్: ప్రీ-ఎక్లాంప్సియా వ్యాధిపై జియ్యమ్మవలస పీహెచ్‌సీ వైద్యాధికారి జగదీష్ ఆధ్వర్యంలో గర్భిణులకు గురువారం అవగాహన కల్పించారు. గర్భధారణ సమయంలో తీసుకోవాల్సిన ఆరోగ్య జాగ్రత్తలను వివరించారు. వైద్య సిబ్బంది సూచనల మేరకు ఐరన్, పోలిక్ యాసిడ్, కాల్షియం మాత్రలను వేసుకోవాలని సూచించారు. పీహెచ్‌సీ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అవగాహన తప్పనిసరి

పాలకొండ రూరల్: మండల వ్యాప్తంగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో జీవాలకు ఆశించే చిటుకు వ్యాధిపై పాడి రైతులు అవగాహన పెంచుకోవాలని పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకుడు ప్రభామాణిక్యరావు అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. ముఖ్యంగా గొర్రెలు, మేకల విషయంలో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ వ్యాధి బారిన జీవాలు పడకుండా ఉండేందుకు తప్పనిసరిగా ఎంట్రో టాక్సీమియా (ఈటీ) వ్యాక్సిన్ వేయించాలన్నారు.

వంతెన పనులను తక్షణమే ప్రారంభించాలి



గిరిజనులతో సమావేశమైన సీపీఎం జిల్లా కార్యదర్శి గంగునాయుడు

కొమరాడ: పూర్ణపాడు, లాబేసు గ్రామాల వద్ద నాగావళి నదిపై నిలిచిపోయిన వంతెన నిర్మాణ పనులను తక్షణమే ప్రారంభించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు ప్రభుత్వాన్ని కోరా రు. నాగావళి నది ఆవలవైపు ఉన్న కొట్టు, తొడు ము, రాయపురం, తులసి వలస, బందవలస, పూజారిగూడ తదితర గ్రామాల్లో గురువారం ఆయన పర్యటించి ప్రజలతో సమావేశమయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వంతెన నిర్మాణం పూర్తి చేయా లన్న డిమాండ్‌తో ఈనెల 26వ తేదీన తహసీల్దార్ కార్యాలయం ఎదుట తలపెట్టిన ధర్నాను విజయవంతం చేయాలని కోరారు. వంతెనకు కూటమి ప్రభుత్వం ఎలాంటి నిధులు కేటాయించక పోవడం దారుణమన్నారు. 1996లో ఒడిశా-ఆంధ్రా సరిహద్దుల్లో వనజ గ్రామం వద్ద పడవ ప్రమాదం జరిగి 36మంది గిరిజనులు మృతిచెందారని గుర్తు చేశారు. అలాంటి ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు, గిరిజనులు రాకపోకలు సాగించేందుకు ఇబ్బంది పడకుండా ఉండేందుకు వంతెన నిర్మాణం చేయాలన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు ఆ దిశగా కృషి చేయాలని కోరారు సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు సాంబమూర్తి తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు న్యాయం చేయాలి



ఆందోళన చేస్తున్న కార్మికులు

పాలకొండ: నగర పంచాయతీలో అవుట్ సోర్సింగ్ విధానంలో ఖాళీగా ఉన్న పోస్టుల్లో కరోనా కాలంలో పనిచేసిన వారికి అవకాశం కల్పించాలని మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ ఫెడరేషన్ కమిటీ గౌరవ అధ్యక్షుడు దావాల రమణారావు కోరారు. ఈ మేరకు గురువారం స్థానిక నగర పంచాయతీ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పారిశుద్ధ్య విభాగంలో ఏర్పడిన ఖాళీలను కొత్తవారితో భర్తీ చేసేందుకు ప్రయత్నిస్తున్నారని.. ఇందుకోసం అధికారులు డబ్బులు తీసుకుంటున్నట్లు ఆరోపణలు వస్తున్నాయని చెప్పారు. కరోనా కాలంలో విధులు నిర్వహించిన వారితో ఆ పోస్టులు భర్తీ చేయాలని కోరారు. పారిశుద్ధ్య కార్మికులకు కొత్త పనిముట్లు అందించాలని కోరారు. లక్షల రూపాయల ఖర్చు చూపిస్తున్నా పారిశుద్ధ్యం మాత్రం మెరుగుపడడం లేదని దీనిపై సమగ్ర విచారణ చేయాలని కోరారు. కార్యక్రమంలో కార్మికులు సంజీవి, శ్రీదేవి, విమల, ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

సాధనతో ఆరోగ్యం..

పాలకొండ రూరల్: నిరంతర యోగా సాధనతో ఆరోగ్యానికి మే లు చేకూరుతుందని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.శ్యాం బాబు అన్నా రు. యోగాంధ్ర కార్య క్రమంలో భాగంగా ఎన్ఎస్ఎస్ యూనిట్-1, 2ల నేతృత్వంలో గురువారం ప్రత్యే క అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా యోగా విశిష్టత, ఆసనాల వలన కలిగే ప్రయోజనాలను శిక్షకుడు జనార్దనరావు విద్యార్థులకు వివరించారు.